పారదర్శకంగా బదిలీలు నిర్వహించాలని నిరసన

కమలానెహ్రూ ఆస్పత్రి ఎదుట నిరసన తెలుపుతున్న సిబ్బంది

నందికొండ, జూన్ 10 : వైద్యశాఖలో బదిలీల ప్రకియను త్వరగా ప్రారంభించి పారదర్శకంగా నిర్వహించాలని డిమాండ్ చేస్తూ హిల్ కాలనీలోని కమలా నెహ్రూ ఏరియా దవాఖాన సిబ్బంది సోమవారం భోజన విరామ సమయంలో నిరసన చేపట్టారు. అనంతరం దవాఖాన సీఎంఓ భానుప్రసాద్‌కు వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దవాఖానలో పదేండ్ల నుంచి తిష్టవేసిన వైద్య సిబ్బందికి స్థాన చలనం కల్పించడంతో పాటు, రెండేండ్లకు మించి గ్రామీణ ప్రాంతాల్లో పని చేసే వారికి బదిలీల్లో అవకాశం కల్పించాలని కోరారు. బదిలీల అనంతరం పదోన్నతుల పక్రియను చేపట్టాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నర్సింగ్ సూపరింటెండెంట్ పీడీ రాజశ్రీ, హెడ్ నర్సులు ఆమనికుట్టి, పద్మావతి, సత్యమ్మ, స్టాఫ్‌నర్సులు వరలక్ష్మి, రేణుకాదేవి, అనిత, ధనలక్ష్మి, జ్యోతి, ఫాతిమారాణి, సైదమ్మ, పద్మజా, బాలు పాల్గొన్నారు.

హామీల అమలులో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలం

● ఎంసీపీఐయూ రాష్ట్ర కార్యదర్శి వస్కుల మట్టయ్య

తాసీల్దార్‌కు వినతిపత్రం అందిస్తున్న ఎంసీపీఐయూ నాయకులు

మిర్యాలగూడ, జూన్ 10 : అసెంబ్లీ ఎన్నికల సమయంలో అనేక హామీలిచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ తర్వాత వాటిని అమలు చేయడంలో విఫలమైందని ఎంసీపీఐయూ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు వస్కుల మట్టయ్య అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం హామీలను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ సోమవారం స్థానిక తాసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం తాసీల్దార్‌కు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పింఛన్‌ను వికలాంగులకు రూ.6వేలు, వృద్ధులకు రూ.4వేలకు పెంచుతామని, మహిళలకు ప్రతినెలా రూ.2500 ఇస్తామని, కౌలు రైతులకు రైతు బంధు, రైతులకు రూ.2లక్షల రుణమాఫీ, వ్యవసాయ కార్మికులకు రూ.12వేలు అందిస్తామని ఇచ్చిన హామీలు నేటికీ నెరవేర్చలేదన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో, కళాశాలల్లో విద్యార్థులకు కార్పొరేట్ స్థాయి విద్యను అందించాలని, ఇందిరమ్మ ఇండ్ల కోసం దరఖాస్తు చేసుకున్న వారికి వెంటనే మంజూరు చేయాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శి వస్కుల సైదమ్మ, నాయకులు పోతుగంటి కాశి, భరత్, జ్యోతి, మోహన్‌నాయక్, అనూక్, ఆశీర్వాదం, సైదులు, నాగయ్య, సందీప్, గురవయ్య, లింగమ్మ, రమణ, రామకృష్ణ, శ్రీను పాల్గొన్నారు.

మార్కెట్ కమిటీ చైర్మన్ పదవిని బీసీలకు కేటాయించాలి

● బీసీ యువజన సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ అశోక్

సమావేశంలో మాట్లాడుతున్న తిరుమలగిరి అశోక్

మిర్యాలగూడ,/ మిర్యాలగూడ టౌన్, జూన్ 10: మిర్యాలగూడ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పదవిని బీసీలకు కేటాయించాలని బీసీ యువజన సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ తిరుమలగిరి అశోక్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం పట్టణం నిర్వహించిన సంఘం సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. నియోజకవర్గంలో అత్యధికంగా బీసీ జనాభా ఉన్నప్పటికీ వారికి నామినేటెడ్ పోస్టులు ఇవ్వడం లేదన్నారు. పాలకులు బీసీల పట్ల చిన్నచూపు చూపుతూ రాజకీయంగా ఎదగనీయకుండా చేయడం దారుణమన్నారు. బీసీల పట్ల అణిచివేత ధోరణి ప్రదర్శిస్తే పార్టీల కతీతంగా బీసీలు ఐక్యంగా ఉద్యమిస్తారని హెచ్చరించారు. సమావేశంలో ఆర్లపూడి శ్రీనివాస్, చిలకల మురళీయాదవ్, సిద్ధం రాజు, నరేశ్, గంగాధర్, హరిగౌడ్, ఉపేందర్, రవి పాల్గొన్నారు.

లైసెన్స్ కలిగిన డీలర్ల నుంచే విత్తనాలు కొనాలి

● ఏడీఏ నాగమణి

దామరచర్లలో ఎరువుల దుకాణాన్ని తనిఖీ చేస్తున్న ఏడీఏ నాగమణి

దామరచర్ల, జూన్ 10 : అధీకృత లైసెన్స్ కలిగిన డీలర్ల నుంచి మాత్రమే రైతులు విత్తనాలు కొనుగోలు చేయాలని ఏడీఏ పి. నాగమణి సూచించారు. మండలంలోని ఫర్టిలైజర్ షాపులను సోమవారం ఆమె తనిఖీ చేశారు. స్టాక్‌ను, రికార్డులను పరిశీలించారు. బీటీ-3 పత్తివిత్తనాలు అమ్మేందుకు ఎవరికీ అనుమతి లేదన్నారు. వీటిని అమ్మినా, సాగు చేసినా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. డీలర్లు ఎరువుల విక్రయాలను ఈ-పాస్ ద్వారానే చేపట్టాలని సూచించారు. ఆమె వెంట ఏఓ కల్యాణచక్రవర్తి, ఏఈఓ రమేశ్ ఉన్నారు.

ముగిసిన వేసవి క్రీడా శిక్షణ శిబిరం

ప్రశంసాపత్రాలు అందుకున్న విద్యార్థులు

మిర్యాలగూడ, జూన్ 10 : పట్టణంలోని హౌసింగ్‌బోర్డులో గల క్లియో స్పోర్ట్స్‌లో 45 రోజుల పాటు నిర్వహించిన బ్యాడ్మింటన్, క్రికెట్, కబడ్డీ వేసవి శిక్షణ శిబిరం ఆదివారంతో ముగిసింది. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో డాక్టర్ అశోక్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. సమ్మర్‌క్యాంపునకు 200 మంది విద్యార్థులు హాజరైనట్లు తెలిపారు. అనంతరం శిక్షణ పూర్తి చేసుకున్న క్రీడాకారులకు మెమెంటోలు, ప్రశంసాపత్రాలు అందించారు. శ్రీనివాస్‌గౌడ్, నరేందర్, పీఈటీలు రత్నం, వెంకటేశ్వర్లు, సీనియర్ క్రీడాకారుడు శ్రీధర్, రహీం , అజీజ్ హాష్మి, బ్యాడ్మింటన్ జిల్లా కోచ్ ఎం.రామకృష్ణ, క్రికెట్, కబడ్డీ కోచ్‌లు వెంకట్ రాజు, నరేశ్, క్లియో స్పోర్ట్స్ సిబ్బంది పాల్గొన్నారు.

కాల్వకట్టను ఆక్రమిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని వినతి


తాసీల్దార్‌కు వినతిపత్రం అందిస్తున్న సుబ్బారెడ్డిగూడెం గ్రామస్తులు

మిర్యాలగూడ, జూన్ 10: మండలంలోని సుబ్బారెడ్డి గ్రామంలో ఉన్న కాల్వ కట్టను ఆక్రమిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ సోమవారం గ్రామస్తులు తాసీల్దార్‌కు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ కాల్వ పక్కన ఉన్న కొంతమంది రైతులు కాల్వ కట్ట భూమిని కబ్జా చేసి తమ పొలంలో కలుపుకుంటున్నారని తెలిపారు. దాంతో కట్ట విస్తీర్ణం తగ్గిపోయి కనీసం నడిచేందుకు దారి లేకుండా పోయిందన్నారు. కార్యక్రమంలో గ్రామస్తులు మంద సైదులు, శివ, నాగేశ్వర్ రావు, గురువయ్య, ఏసయ్య, నాగయ్య, నగేశ్, అభి పాల్గొన్నారు.

ప్రజావాణి దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలి

● జిల్లా కలెక్టర్ దాసరి హరిచందన

ప్రజల నుంచి వినతిపత్రాలు స్వీకరిస్తున్న కలెక్టర్ దాసరి హరిచందన

నీలగిరి, జూన్ 10 : ప్రజావాణిలో బాధితులు అందించిన దరఖాస్తులను తక్షణమే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ దాసరి హరిచందన అధికారులను ఆదేశించారు. పార్లమెంట్, ఎమ్మెల్సీ ఎన్నికల అనంతరం తిరిగి సోమవారం ప్రారంభమైన ప్రజావాణి కార్యక్రమంలో ఆమె పాల్గొని ప్రజల వద్ద నుంచి దరఖాస్తులను స్వీకరించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి పెద్ద ఎత్తున తరలివచ్చిన ప్రజలు తమ సమస్యలపై కలెక్టర్‌కు వినతిపత్రాలు అందించారు. ఈ సందర్భంగా కలెక్టర్ కొన్ని ఫిర్యాదులను అక్కడి కక్కడే పరిష్కరించగా మరి కొన్నింటిని పరిశీలించి పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ప్రజావాణి ద్వారా స్వీకరించిన దరఖాస్తులన్నింటిని వెంటనే పరిష్కరించాలని సూచించారు. జిల్లా కేంద్రంతో పాటు, డివిజన్, మండల స్థాయిలో వచ్చే దరఖాస్తులను కూడా సత్వరమే పరిష్కరిఆచలన్నారు. సోమవారం వ్యక్తిగత సమస్యలతో పాటు, విద్య, ఉద్యోగం, ఉపాధి, భూమి సంబంధిత ఫిర్యాదులు ఎక్కువగా వచ్చాయి. కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ టి. పూర్ణచంద్ర, డీఆర్ఓ రాజ్యలక్ష్మి, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు

● స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ పూర్ణచంద్ర

వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న అదనపు కలెక్టర్ పూర్ణచంద్ర

నీలగిరి, జూన్ 10 : జిల్లాలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు చేపట్టినట్లు స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ టి. పూర్ణచంద్ర తెలిపారు. మాన్‌సూన్ యాక్షన్ ప్లాన్‌పై పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క సోమవారం జిల్లా అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి సీజనల్ వ్యాధులు ప్రబలకుండా తీసుకోవాల్సిన చర్యలపై పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా జిల్లాలో చేపట్టనున్న కార్యక్రమాలపై అదనపు కలెక్టర్ ఆమెకు వివరించారు. తాగునీరు కలుషితం కాకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నామని, వర్షపు నీరు నిల్వ ఉండకుండా చర్యలు చేపడుతున్నామని చెప్పారు. నీరు నిల్వ ఉన్న చోట దోమలు వృద్ధి చెందకుండా ఆయిల్ బాల్స్, గంబూషియ చేప పిల్లలను వదులుతామని పేర్కొన్నారు. జిల్లాలో మిషన్ భగీరథ సర్వే కొనసాగుతున్నదని, స్కూల్ పిల్లలకు మొదటి విడుత యూనిఫామ్ పంపిణీకి చర్యలు చేపట్టామని, రెండో విడుతకు సంబంధించిన క్లాత్ జిల్లాకు వచ్చిందని తెలిపారు. వీడియో కాన్ఫరెన్స్‌లో డీఆర్‌డీఏ పీడీ నాగిరెడ్డి, జడ్పీ సీఈఓ ప్రేమ్‌కరణ్‌రెడ్డి, జిల్లా పంచాయతీ అధికారి మురళి, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ డి.వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ప్రజలకు స్వచ్ఛమైన తాగునీటిని అందించాలి

● మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి

మాట్లాడుతున్న మున్సిపల్ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి

నీలగిరి, జూన్ 10 : వానకాలంలో నీరు కలుషితమయ్యే అవకాశం ఉంటుందని, ప్రజలకు స్వచ్ఛమైన తాగునీటిని అందించేందుకు మున్సిపల్ అధికారులు ప్రణాళికలు రూపొందించాలని మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్ రెడ్డి సూచించారు. సోమవారం మున్సిపల్ సమావేశ మందిరంలో నీటిసరఫరా అధికారులు, సిబ్బందితో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణ ప్రజలకు తాగునీటిని అందించే ఫిల్టర్ బెడ్స్, ట్యాంకులను నిత్యం శుభ్రం చేయాలని, క్లోరినేషన్ చేపట్టాలని ఆదేశించారు. తాగునీటి పైప్‌లైన్లలో మురుగు నీరు చేరకుండా నల్లా గుంతలు పూడ్చివేయాలని, మోటర్ల వద్ద విద్యుత్ సరఫరాలో అంతరాయం కలిగితే ప్రత్యామ్నాయంగా జనరేటర్లు అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. నీటి పన్ను బకాయిలు వసూలు చేయాలని సిబ్బందికి సూచించారు. సమావేశంలో మున్సిపల్ కమిషనర్ సయ్యద్ ముసాబ్ అహ్మద్, డీఈ అశోక్‌కుమార్, ఏఈ దిలీప్ భార్గవ్, ఫిట్టర్లు, ఆపరేటర్లు పాల్గొన్నారు.

జిల్లా కేంద్రంలో ర్యాలీ నిర్వహిస్తున్న గ్రామీణ వైద్యులు

గ్రామీణ వైద్యులపై దాడులను నిలిపివేయాలి

● సుశ్రుత గ్రామీణ వైద్యుల సంఘం గౌరవాధ్యక్షుడు హనుమంతరావు

నీలగిరి, జూన్ 10 : జిల్లాలో గ్రామీణ వైద్యులు నిర్వహించే ప్రథమ చికిత్సాలయాలపై జరుగుతున్న దాడులను నిలిపివేయాలని సుశ్రుత గ్రామీణ వైద్యుల సంఘం రాష్ట్ర గౌరవాధ్యక్షుడు పి.హనుమంతరావు కోరారు. సోమవారం జిల్లా కలెక్టర్‌ను కలిసి ఈ మేరకు వినతిపత్రం అందించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ ప్రభుత్వ జీఓ ప్రకారం కమ్యూనిటీ, పారామెడికల్ కోర్సు ట్రైనింగ్, జిల్లా ప్రభుత్వ వైద్యశాలలో శిక్షణ పూర్తి చేసిన వారే క్లినిక్‌లు నిర్వహిస్తున్నారని తెలిపారు. మారుమూల ప్రాంతాలైన తండాలు, గూడేలు, అవాస గ్రామాలు, మురికివాడల్లో ఆర్‌ఎంపీలు పేద ప్రజలకు అందుబాటులో ఉండి వైద్య సేవలు అందిస్తున్నట్లు పేర్కొన్నారు. కానీ ఐఎంఏకు సంబంధించిన, ఎన్ఎంసీ, హెచ్ఆర్‌డీఏ, టీఎస్ఎంసీ కౌన్సిల్ నుంచి వచ్చిన విజిలెన్స్ అధికారులు గ్రామీణ వైద్యుల క్లినిక్‌లపై దాడులు చేస్తూ కేసులు నమోదు చేస్తూ భయభ్రాంతులకు గురి చేస్తున్నారని తెలిపారు. దాడులు ఆపకపోతే రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళన చేస్తామని హెచ్చరించారు. ఆయన వెంట సంఘం జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్‌రాజు, ప్రధాన కార్యదర్శి నర్సింహారెడ్డి, కోశాధికారి సీహెచ్ బ్రహ్మచారి, డీఎస్ఎన్ చారి, కృష్ణారెడ్డి, వెంకటేశ్వర్ గౌడ్, మదనాచారి, యాదగిరి ఉన్నారు.

గ్రామీణ వైద్యులకు గుర్తింపు ఇవ్వాలని ర్యాలీ

శాలిగౌరారం, జూన్ 10 : గ్రామీణ ప్రాంతాల ప్రజలకు నిత్యం అందుబాటులో ఉండి ప్రథమ చికిత్స అందిస్తున్న గ్రామీణ వైద్యులను ప్రభుత్వం గుర్తించి, చట్టబద్ధత కల్పించాలని కోరుతూ గ్రామీణ వైద్యుల సంఘం ఆధ్వర్యంలో సోమవారం మండల కేంద్రంలో ధర్నా, రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం నాయకులు మాట్లాడుతూ గ్రామీణ వైద్యులపై దాడులు చేయడం సరికాదన్నారు. అనంతరం కలెక్టర్‌కు వినతిపత్రం అందించేందుకు వెళ్లారు. కార్యక్రమంలో సంఘం సభ్యులు వీపూరి పరంకుశం, దునక వెంకన్న, బండారు ధనుంజయ్య, వెంకన్న, అశోకాచారి, దామెర్ల శ్రీనివాస్, జబ్బార్, దోన కొండ అంజయ్య, స్వామి, వీరాచారి, అశోక్ పాల్గొన్నారు.

పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో విద్యార్థులకు పురస్కారాలు

పురస్కారం అందిస్తున్న పద్మశాలి సంఘం నాయకులు

చిట్యాల, జూన్ 42 : టెన్త్, ఇంటర్, ఎంబీబీఎస్‌లో ప్రతిభ కనబర్చిన పద్మశాలి విద్యార్థులను భక్త మార్కండేయ పద్మశాలి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం రాత్రి చిట్యాలలో ఘనంగా సన్మానించారు. విద్యార్థులకు శాలువా, జ్ఞాపికను అందించారు. కుకుడాల గోవర్ధన్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ చెరుపల్లి సీతారాములు, మున్సిపల్ చైర్మన్ కోమటిరెడ్డి చినవెంకట్‌రెడ్డి, రిటైర్డ్ జడ్జి కుకుడాల లక్ష్మణ్, సెంట్రల్ యూనివర్సిటీ ప్రొఫెసర్ పిల్లలమర్రి రాములు, సంఘం ప్రతినిధులు జెల్లా మనోహర్, గంజి వెంకటేశం, ప్రకాశ్, జెల్ల సత్తయ్య పాల్గొన్నారు.

కల్లేపల్లి ఆలయం వద్ద తలనీలాల సేకరణకు 14న వేలం

దామరచర్ల, జూన్10: మండలంలోని కల్లేపల్లి బంగారు మైసమ్మ ఆలయం వద్ద ఏడాది పాటు దున్నపోతులు, తలనీలాలు, కొబ్బరిచిప్పలు సేకరించేందుకు ఈ నెల 14న బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు ఆలయ ఈఓ జి. కొండారెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆలయ ప్రాంగణంలో ఉదయం 11 గంటలకు నిర్వహించే వేలంలో పాల్గొనదలచుకున్న వారు దున్నపోతుల సేకరణకు రూ. లక్ష, కొబ్బరిచిప్పలు, తలనీలాల సేకరణకు రూ. 50వేల చొప్పున డిపాజిట్ చెల్లించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. గత వారం నిర్వహించిన వేలంలో గతేడాది కంటే తక్కువకు పాడినందున వాటిని రద్దు చేసి తిరిగి నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

దివ్యాంగుల హాస్టల్‌లో చేరికకు దరఖాస్తులు

నీలగిరి, జూన్ 10 : ప్రభుత్వ దివ్యాంగుల బాలుర వసతి గృహంలో ప్రవేశానికి అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా మహిళా, శిశు, దివ్యాంగుల, వయోవృద్ధుల శాఖ అధికారి బి. సక్కుబాయి సోమవారం ఒక ప్రకటనలో కోరారు. నల్లగొండ పట్టణంలో ఇంటర్మీడియట్ ఆపై తరగతులు చదివే శారీరక వికలాంగులు, అంధులు, బధిరులు అర్హులని తెలిపారు. దరఖాస్తుతోపాటు కళాశాలలో చెల్లించిన ఫీజు రసీదు, సదరం సర్టిఫికెట్, బోనఫైడ్, ఆధార్ కార్డ్, ఆదాయ, కుల ధ్రువీకరణ పత్రాలు, రెండు పాస్‌పోర్ట్‌సైజ్ ఫొటోలు, టెన్త్ మెమోతో జిల్లా కార్యాలయలోగానీ, ది వ్యాంగుల హాస్టల్‌లోగానీ దరఖాస్తు చేసుకోవాలని, వివరాలకు 915475 9888ను సంప్రదించాలని సూచించారు.

హత్య కేసులో నిందితుడికి జీవిత ఖైదు

నీలగిరి, జూన్ 10 :హత్యకేసులో నిందితుడిపై నేరం రుజువు కావడంతో జీవిత ఖైదుతో పాటు వెయ్యి రూపాయల జరిమానా విధిస్తూ జిల్లా కోర్టు న్యాయమూర్తి ఎన్.రోజారమణి సోమవారం తీర్పు ఇచ్చారు. వివరాల్లోకి వెళ్లితే.. నల్లగొండ మండలం కూతురుగూడెం గ్రామానికి చెందిన కానుగు వెంకయ్య గ్రామంలో తేలు, పాము కాటుకు గురైన వాళ్లకు మంత్రం వేస్తూ.. అదే గ్రామంలోని గుడిని శుభ్రం చేసి దీపారాధన చేస్తూ జీవనం సాగిస్తుండేవాడు. అదే గ్రామానికి చెందిన పెద్దబోయిన శ్రీనుకు ఆరోగ్య సమస్యలు తలెత్తడంతో తనకు వెంకయ్య మంత్రాలు చేశాడంటూ పంచాయితీ పెట్టాడు. గ్రామ పెద్దలు అతడిని నచ్చజెప్పడంతో సమస్య సద్దుమణిగింది. అయినా ఇదే విషయాన్ని మనసులో పెట్టుకున్న శ్రీను 2013 ఫిబ్రవరి 18న గుడి శుభ్రం చేస్తున్న వెంకయ్యపై గొడ్డలితో దాడి చేసి హత్య చేశాడు. అతడిపై కేసు నమోదు చేసిన పోలీసులు కేసు విచారణ చేసి కోర్టుకు సమర్పించారు. ఈ కేసుపై 11 సంవత్సరాలపాటు విచారణ అనంతరం జడ్జి నిందితుడికి జీవిత ఖైదు విధిస్తూ తీర్పు చెప్పారు. కేసులో పక్కాగా ఆధారాలు సేకరించిన ఎస్ఐ శివకుమార్, సీఐ డానియల్‌కుమార్, పీపీ ఎన్. శ్రీనివాస్‌ను ఆమె అభినందించారు.

రేణుకా ఎల్లమ్మ ఆలయ హుండీ లెక్కింపు

నల్లగొండ సిటీ, జూన్ 10 : కనగల్ మండలంలోని దర్వేశిపురం రేణుకాఎల్లమ్మ ఆలయ హుండీని సోమవారం దేవాదాయశాఖ జిల్లా సహాయ కమిషనర్ కె. మహేంద్రకుమార్, ఈఓ జయరామయ్య, ఆలయ చైర్మన్ అలుగుబెల్లి నరసింహారెడ్డి సమక్షంలో లెక్కించారు. 87 రోజులకు రూ.12,87,776 ఆదాయం సమకూరినట్లు ఇన్‌స్పెక్టర్ వెంకటలక్ష్మి తెలిపారు. కార్యక్రమంలో ఆలయ మాజీ చైర్మన్లు గోపాల్‌రెడ్డి, కరుణాకర్‌రెడ్డి, ధర్మకర్తలు శ్రీశైలం, శంకర్‌రెడ్డి, యాదగిరి, వెంకన్న, సీనియర్ అస్సిసెంట్ చంద్రయ్య సిబ్బంది పాల్గొన్నారు.

13న ఆంజనేయస్వామి ఆలయం వద్ద దుకాణాల వేలం

చిట్యాల, జూన్ 10 : మండలంలోని వెల్మినేడులో గల ఆంజనేయ స్వామి ఆలయం వద్ద కొబ్బరికాయలు, పూజాసామగ్రి, లడ్డూ, పులిహోర విక్రయం కోసం ఈ నెల 13న వేలంపాట నిర్వహించనున్నట్లు ఆలయ మేనేజర్ అంబటి నాగిరెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 11.30 గంటలకు జరిగే వేలంలో పాల్గొనేందుకు ఆసక్తి గల వారు హాజరు కావాలని సూచించారు.

అధికారులు సమన్వయంతో పని చేయాలి

● ఎమ్మెల్యే బాలూనాయక్

సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బాలూనాయక్

చందంపేట(నేరేడుగొమ్ము), జూన్10 : అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పని చేసి నేరేడుగొమ్ము మండలాభివృద్ధికి కృషి చేయాలని దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలూనాయక్ సూచించారు. చందంపేట మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన నేరేడుగొమ్ము మండల సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడారు. అర్హులైన వారికి ప్రభుత్వ పథకాలు అందేలా అధికారులు చొరవ చూపాలన్నారు. గ్రామాల్లో నాణ్యమైన 24 గంటల కరెంటు అందించాలన్నారు. అనంతరం పలువురు ఎంపీటీసీలు తమ గ్రామాల్లో నెలకొన్న సమస్యలను సభ దృష్టికి తీసుకొచ్చారు. వాటిని పరిష్కరించాలని ఎమ్మెల్యే అధికారులను ఆదేశించారు. ఎంపీపీ బిక్కునాయక్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో జడ్పీటీసీ బాలూనాయక్, వైస్ ఎంపీపీ సరోజ, తాసీల్దార్ ఉమా, ఎంపీడీఓ ఝాన్సీ లక్ష్మీబాయి, పీఏసీఎస్ చైర్మన్ శ్రీశైలంయాదవ్, వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. అనంతరం తిమ్మాపురం గ్రామ ప్రాథమికోన్నత పాఠశాలలో జరుగుతున్న అభివృద్ధి పనులను ఎమ్మెల్యే పరిశీలించారు. త్వరగా పూర్తి చేయాలని సూచించారు.

శాంతిభద్రతల పరిరక్షణకు చర్యలు తీసుకోవాలి

చందంపేట(దేవరకొండ) : దేవరకొండ నియోజకవర్గంలో శాంతిభద్రతల పరిరక్షణకు పోలీసు అధికారులు చర్యలు తీసుకోవాలని, దొంగతనాలు, గంజాయి రవాణా, వినియోగం వంటి వాటిని అరికట్టేందుకు కఠినంగా వ్యవహరించాలని ఎమ్మెల్యే నేనావత్ బాలూనాయక్ ఆదేశించారు. సోమవారం తన నివాసంలో దేవరకొండ సర్కిల్ పరిధిలోని పోలీసు అధికారులతో సమావేశం నిర్వహించారు. నియోజకవర్గంలో శాంతిభద్రతలకు సంబంధించిన వివరాలను డీఎస్పీ గిరిబాబును అడిగి తెలుసుకున్నారు. సమావేశంలో సీఐలు నర్సింహులు, సురేశ్, ఎస్ఐలు సతీశ్, యాదయ్య పాల్గొన్నారు.

హరిత తెలంగాణ సాధనకు కృషి చేయాలి

● ఎంపీపీ బాలాజీనాయక్

మొక్కను నాటుతున్న ఎంపీపీ బాలాజీనాయక్

అడవిదేవులపల్లి, జూన్ 10: ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించడం ద్వారా హరిత తెలంగాణ సాధనకు కృషి చేయాలని ఎంపీపీ ధనావత్ బాలాజీనాయక్ కోరారు. ప్రపంచ పర్యావరణ ఉత్సవాల్లో భాగంగా సోమవారం మండల కేంద్రంలో నిర్వహించిన మొక్కలు నాటే కార్యక్రమంలో ఆయన పాల్గొని మొక్క నాటారు. అనంతరం మాట్లాడుతూ రాష్ట్రం పచ్చగా ఉండాలనే లక్ష్యంతో ప్రతి ఏటా ప్రభుత్వం కొన్ని కోట్ల మొక్కలను నాటుతుందన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ కరుణాకర్‌రావు, ఎంపీఓ మోసీన్‌బిన్ అహ్మద్, ఏపీఓ లావూడి సూరానాయక్, సిబ్బంది పాల్గొన్నారు.

జిలాయిపేట చెరువును పరిశీలించిన అధికారులు

చెరువును పరిశీలిస్తున్న ఇరిగేషన్‌శాఖ చీఫ్ ఇంజినీర్ అజయ్‌కుమార్

నల్లగొండ సిటీ, జూన్ 10 : కనగల్ మండలం రేగట్టె గ్రామ పరిధిలోని జిలాయిపేట చెరువును సోమవారం ఇరిగేషన్ చీఫ్ ఇంజినీర్ అజయ్‌కుమార్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మంత్రి కోమటిరెడ్డి ఆదేశాను సారం చెరువును అభివృద్ధి చేసేందుకు చెరువుకట్టల నాణ్యతను పరిశీలించి మరమ్మతుల నిమిత్తం ప్రతిపాదనలు ఉన్నతాధికారులకు పంపించనున్నట్లు చెప్పారు. ఆయన వెంట నాయకులు బి. వెంటేశం, డీఈ ఆనందరావు, మునుగోడు, కనగల్, చండూరు డీఈలు, ఏఈలు ఉన్నారు.

ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పించాలని వినతి

ఆర్ఎం శ్రీదేవికి వినతిపత్రం అందిస్తున్న చిన్నసూరారం గ్రామస్తులు

నల్లగొండ రూరల్, జూన్ 10 : నల్లగొండ నుంచి వయా పెద్ద సూరారం, చిన్నసూరారం, నకిరేకల్, ఆరెగూడెం వరకు ఆర్టీసీ బస్సును నడిపించాలని కోరుతూ చిన్నసూరారం మాజీ సర్పంచ్ నారగోని నరసింహ గౌడ్ ఆధ్వర్యంలో గ్రామస్తులు సోమవారం ఆర్ఎం శ్రీదేవికి వినతిపత్రం అందించారు. ఈ విషయమై సానుకూలంగా స్పందించిన ఆర్ఎం ఈ నెల 12 నుంచి పాఠశాలలు ప్రారంభం కానున్నందున బస్సు సౌకర్యం కల్పిస్తామని హామి ఇచ్చినట్లు వారు పేర్కొన్నారు.

మత్స్య సహకార పారిశ్రామిక సంఘం మాజీ కార్యదర్శికి పరామర్శ

వెంకటయ్యను పరామర్శిస్తున్న మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ సురేశ్‌రెడ్డి

శాలిగౌరారం, జూన్ 10 : అనారోగ్యంతో బాధపడుతున్న శాలిగౌరారం ప్రాజెక్ట్ మత్స్య పారిశ్రామిక సహకార సంఘం మాజీ ప్రధాన కార్యదర్శి పడాల వెంకటయ్యను సోమవారం నకిరేకల్ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ చాడ సురేశ్‌రెడ్డి పరామర్శించారు. మండలంలోని తిరుమలరాయినిగూడెం పరిధిలోని మంగమ్మగూడెంలో ఆయన ఇంటికి వెళ్లి పరామర్శించడంతో పాటు ధైర్యం చెప్పారు. ఆయన వెంట గుజిలాల్ శేఖర్‌బాబు, మాజీ డైరెక్టర్ పడాల సైదులు, వేముల గోపీనాథ్, శ్రీరామదాసు రాజు, పడాల వెంకన్న, సత్తయ్య, నర్సింహ, నోముల బీరప్ప, కూరం వెంకన్న ఉన్నారు.

ఐ